# 16. చెలియలికట్ట

విసుగు నెరుగని విక్రమార్కుడు మర్రిచెట్టెక్కి, శవాన్ని భుజాన వేసుకొని మెల్లిగా నడక సాగించాడు.

శవాన్ని ఆవహించిన వీర్య భేతాళుడు అన్నాడు:

"రాజా! నీ కార్యదీక్షను మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నాను. 'విధి' అని నమ్మినదాన్ని ఇంత పట్టుదలతో సాధించగలగటం నీకే చెల్లింది. ఐతే ఎంత పవిత్రోద్దేశంతో పనులు ప్రారంభించి, నీతి తప్పక, విధిని విడనాడక గుంజుకున్నా పర్యవసానంగా కీడు జరగవొచ్చు; పుణ్యకార్యాల ఫలితం పాపమే అవొచ్చు. అందుకనే 'పుణ్యానికి వెళితే పాపం ఎదురైంది!' అనే సామ్యం ఏర్పడింది. నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు డాక్టర్ సదాశివం పొందిన భంగపాటును గూర్చిన కథ చెపుతాను; విను:"

వీర్యభేతాళుడు చెప్పిన కథ ఇది:

బీదరికంలో పుట్టి, అందులోనే పెరిగి, కష్టించి చదివి తన ప్రతిభ కారణంగా సదాశివం పరదేశాలకు్కూడా వెళ్ళి, యం.డి. డిగ్రీ సంపాయించాడు. సెక్సాలజీలో అతన్ని మించినవారు ఇండియాలోనే లేరనే కీర్తి గడించాడు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌గా ఉంటూనే కొద్ది ప్రైవేటు ప్రాక్టీసు కూడా చేసేవాడు.

బీదరికపు బాధ లేమిటో స్వయంగా అనుభవించి ఆకళింపు చేసుకున్న వాడవటంవల్లా, మానవత్వపు విలువల్ని ఆమూలాగ్రంగా గ్రహించిన కారణంగానూ–

డాక్టర్ సదాశివం వ్యాధి నివారణలో చూపే కౌశలం, ఫీజు వసూలు చేసుకోవటంలో చూపేవాడు కాదు.

ఐనప్పటికీ ధనికవర్గాలవారు తగినంత ముట్టజెప్పే తత్వమున్నవారు కనుక, సదాశివం త్వరలోనే ఐశ్వర్యవంతుల కోవలోకి వచ్చాడు.

అతని జీవితం మూడుపువ్వులు, ఆరు కాయలుగా సాగిపోతూన్న కాలంలో ఒక రోజున మహదైశ్వర్యవంతులైన రామ్మూర్తి దంపతులు ఆయన్ను దర్శించారు.

రామ్మూర్తి వయస్సు 43సంవత్సరాలు. ఆయన భార్య సుందరమ్మ వయస్సు 35 సంవత్సరాలు. వారు గత 18 సంవత్సరాలుగా దాంపత్య నిర్వహణను శక్తివంచన లేకుండా కొనసాగిస్తున్నప్పటికీ, సంతానం కలగలేదు. ఎప్పటికప్పుడు సుందరమ్మ గర్భం ధరించిందని భ్రమ పడటమే తప్ప, తీరా డాక్టర్లు పరీక్షించి 'కాదు' అని ఖచ్చితంగా తేల్చటం జరుగుతూనే ఉన్నది.

పుణక్షేత్రాలను దర్శించటం, ముడుపులు కట్టడం, నోములు నోయటం, అనేక అర్చనలు చేయించటంలాటి అనేక పుణ్యకార్యాలు ఆచరించారు. ఐతే మానవమాత్రులే సాధించగలిగిందానికి దేవుడెందుకనే అనుమానం వారికి రాలేదు. ఇప్పుడు డాక్టర్ సదాశివం దగ్గరి కొచ్చారు; ఎలాగైనా తమకో వంశోద్ధారకుణ్ని ప్రసాదించే బాధ్యత ఆయనకు అప్పగించారు.

ఆధునిక విజ్ఞాన శాస్త్ర రీత్యా చేయవలసిన పరీక్షలన్నీ పూర్తయినవి. డాక్టర్ సదాశివం నిశ్చితాభిప్రాయాలను వినేందుకు రామ్మూర్తి దంపతులు ఆయనకు ఎదురుగా కూర్చున్నారు.

"నేను చెప్పే విషయాల కారణంగా మీరు కుంగిపోరాదు. సుందరమ్మగారిలో ఎలాటి లోపమూ లేదని ఖచ్చితంగా తేలింది. పోతే మీలో గర్భధారణకు అవసరమైనన్ని వీర్యకణాలు కనిపించటం లేదు" అన్నాడు డాక్టర్ సదాశివం.

"వైద్యంవల్ల ప్రయోజనం ఉంటుందా?" అని రామ్మూర్తి అడిగాడు.

జవాబుగా డాక్టర్ సదాశివం తల అడ్డంగా తిప్పాడు.

"ఐతే మాకు నిరాశేనా?"

"నాకు తోచింది మరొక్కటే మార్గం–"

"చెప్పండి."

"ఏం లేదు. కృత్రిమ విధానంలో ఈ గర్భధారణకు అవకాశం ఉన్నది. అంటే వేరొక పురుషుని వీర్యాన్ని, ఆమె గర్భకోశంలోకి పంపటం ద్వారా గర్భధారణ జరుగుతుంది."

దంపతుల ముఖ కవళికల్ని గమనించాడు సదాశివం. రామ్మూర్తి మొహం నల్లబడింది; సుందరమ్మ నిర్లిప్తంగా ఉన్నది.

"ఈ విషయాన్ని గూర్చి ఇంకా వినదల్చుకున్నారా?" అని డాక్టర్ అడిగాడు.

"చెప్పండి" అన్నాడు రామ్మూర్తి నీరసంగా.

"ఇప్పుడు పరదేశాలలో ఈ పద్ధతి విరివిగా విజయవంతంగా సాగుతున్నది. మనదేశంలో కూడా ఈ విధానం అమలు జరుపబడుతూనే ఉన్నది. ఎటొచ్చీ అంతా రహస్యంగా ఉంటుంది– కనుక, సరైన అంచనాలు తెలియవు. పోతే మీ గుణగుణాలను పరిశీలించి కాస్త కుడి ఎడంగా ఇవే గుణగణాలు ఉన్న వీర్యదాతను నేను ఎన్నుకుంటాను. దాతకు తానెవరికి దానం చేస్తున్నదీ తెలియదు; చేసిం దెవరో మీకు తెలియదు. ఆ రహస్యం నాకొక్కడికే తెలుసు. నాతోపాటే అది సమాధి చేయబడుతుంది. మీరు కానీ, ఆ దాత కానీ, ఎప్పుడూ నన్ను 'ఆ వ్యక్తి ఎవరు?' అని అడగరాదు. అడిగినా నేను చెప్పరాదు; చెప్పను... కుర్రవాణ్ణి పెంచుకునే పక్షంలో ఆ కుర్రవాడు మీ ఉభయుల్లోనూ ఎవ్వరికీ చెందడు. ఈ విధానంలోని బిడ్డ కనీసం తల్లి రక్తమాంసాలను పంచుకొని పుడతాడు... ఇక ఇందులో ఇమిడి ఉన్న మతైక నైతిక విషయాలు నాకు అనవసరం. మానవ జీవితాన్ని సుఖమయం చేయటమే నా బాధ్యత. అందుకు నేను దీక్షపూనానని నమ్ముతున్నాను–"

రామ్మూర్తి దంపతులు ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు. మరుక్షణంలోనే సుందరమ్మ తల వాల్చేసింది. నిర్ణయం తన భర్తదే కనుక తాను నామమాత్రమైనట్లు సూచించింది.

"తొందరేం లేదు–" అన్నాడు సదాశివం. "ముందు ముందు మీరు మనసుల్లో కలతలు పెంచుకోరాదు. అదీగాక మీ ఉభయుల వయస్సూ సహజ గర్భధారణకు అనుకూలంగా కూడా లేదు. ఏమైనా మీరు ఆలోచించుకొని నిర్ణయానికి రావటం మంచిది."

నెల గడిచాక ఒక రోజు రామూర్తి దంపతులు సదాశివం దగ్గరికి వచ్చారు. సదాశివం ఆ విషయమే మరిచిపోయాడు. ఈసారి ఆ దంపతుల నిర్ణయ మేమిటో, వారు చెప్పక మునుపే సదాశివానికి తెలుసు.

దంపతులు ఏం తర్జనభర్జన పడ్డారో, లేక ఎలా సమాధానపడ్డారో సదాశివానికి అనవసరం. పీడిత మానవాళికి శక్తివంచన లేకుండా బాధా విముక్తి చేయటమే సదాశివం జీవిత లక్ష్యం.

ఆ రాత్రంతా దీర్ఘంగా ఆలోచించి – రామ్మూర్తి గుణగణాలకు సమీపంలో ఉన్న వ్యక్తిని సదాశివం ఎన్నిక చేశాడు. తన విద్యార్థుల్లో శంకరాన్ని యోగ్యుడుగా ఆయన నమ్మాడు.

ఎక్కువ శ్రమ లేకుండానే వీర్యదానానికి శంకరం అంగీకరించాడు. ఆ తరువాతి కార్యక్రమం యధావిధిగా జరిగింది.

సంవత్సరం తిరక్కుండానే పనసపండంటి కొడుకు నెత్తుకొని ఆ దంపతులు అమితానందంతో సదాశివాన్ని దర్శించారు. తన విధి సక్రమంగా నెరవేరినందుకు డాక్టర్ ఎంతో సంతోషించాడు. రామ్మూర్తి పదివేల రూపాయలు సదాశివానికి బహూకరించాడు. ఈ చికిత్సకు అంత మొత్తం తీసుకోవటం అన్యాయంగా భావించి, సదాశివం నిరాకరించాడు. రామ్మూర్తి వేడుకున్నాడు; తన ఆనందాన్ని గాయపరచ వద్దని మొత్తుకున్నాడు. ఇక తప్పనిసరై డాక్టర్ సదాశివం ఆ మొత్తాన్ని స్వీకరించక తప్పలేదు.

## 2

నాటికి నేడు– అంటే ఇరవైరెండేళ్ళ తరువాత ప్రపంచం ఎంతో మారిపోయింది. ముఖ్యంగా డాక్టర్ సదాశివం చాలా ముసలివాడైపోయాడు. డెబ్బయ్యోపడిలో బ్లడ్ ప్రెషర్‌తో దాదాపు కదలలేని స్థితిలో ఉన్నాడు. ప్రాక్టీస్ మానేసి ఐదేళ్ళయింది. ఇప్పుడు ఆయన్ను చూడవచ్చేవాళ్ళు కూడా దాదాపు లేరు.

అలాటిది సాయంత్రం శంకరం వచ్చాడు. కాస్సేపు కుశల ప్రశ్నలయ్యాక శంకరం తన ఏకైక పుత్రికా వివాహ మహోత్సవాహ్వాన పత్రికను, డాక్టర్ సదాశివానికిస్తూ "మిమ్ము స్వయంగా రమ్మని ఆహ్వానించలేననుకోండి, తమ నీ స్థితిలో ఎలా రమ్మనేది? మీ దీవెనల కోసం వచ్చాను" అన్నాడు.

సదాశివం నవ్వాడు.

"దానికేం... ఈ నూతన వధూవరులు కలకాలం సుఖప్రదమైన దాంపత్య జీవితాన్ని గడుపుతారు గాక!" అన్నాడు సదాశివం.

శంకరం నమస్కరించి వెళ్ళిపోయాడు.

రాత్రి ఎనిమిదింటికి డాక్టర్ సదాశివం భోజనం వచ్చింది. పక్కలోనే కూర్చుని రోస్టుచేసిన రెండు రొట్టెముక్కల్ని తిని, గ్లాసు పాలు తాగాడాయన.

ఫాన్ గాలికి పక్కనే ఉన్న టేబిల్‌మీది కవరు రెపరెప లాడుతూ మనసును అటే లాగుతోంది. డాక్టర్ సదాశివం ఆ కవరు అందుకొని విప్పాడు. అది సాయంత్రం శంకరం ఇచ్చిన వివాహ ఆహ్వాన పత్రిక.

యధాలాపంగానే ఆ పత్రికను చదివాడు సదాశివం. శంకరం ఏకైక కుమార్తె మంజుల బి.ఎ. ను; కీ.శే. రామ్మూర్తి ఏకైక పుత్రుడు సుదర్శనం యమ్.ఎ., కు ఇచ్చి మర్నాటి తెల్లవారుజామున తిరుపతిలో పెళ్ళి!

హఠాత్తుగా సదాశివం రక్తప్రసారం విజృంభించింది. ఈ రక్తపుపోటుకు నీరసించిన నరాలు తెగి, తనకు కపాలమోక్షమౌతుందేమోననే భయం పట్టుకుం దాయన్ను. తనను తాను నమ్మలేని స్థితిలో పడ్డాడు. గదిగోడలన్నీ కలుసుకొనిపోతూ మధ్య ఉన్న తనను పిండిపిండి చేస్తున్నవేమో ననిపించింది. శరీర మంతా చిరుచెమట్లు కమ్మినవి. మృత్యువు వెంబడించగా చాలాదూరం నుంచి పరుగెత్తుకుంటూ వొచ్చి ఊపిరందక గిజగిజలాడుతున్న ట్లనిపించింది.

కాసేపు గట్టిగా కళ్ళు మూసుకొని అంతా మరిచిపొయ్యేందుకు వ్యర్థప్రయత్నం చేశాడు సదాశివం. అరగంటసేపు నానా అవస్థా పడ్డాక మొదటి ఆతృతా, ఉద్వేగం, అలుపూ మొదలైనవి కాస్త తగ్గి, కొంచెం స్థిమితం ఏర్పడింది.

మరోసారి వివాహపత్రిక చదివాడు. నిస్సందేహంగా ఆ నల్లని అక్షరాలు - నల్లని భూతాలవలె స్పష్టంగా దర్శనమిచ్చినవి.

ఆ తరువాత ఇరవైరెండు సంవత్సరాల నాటి సంఘటనలు కళ్ళముందాడినవి. ఈ రామ్మూర్తి దంపతులు ఇంత బాగా తనకు గుర్తున్న కారణం ఆ కృత్రిమ గర్భాన్ని సృష్టించిన తనకు పదివేల రూపాయలు ఫీజు ఇవ్వటమే!

వారి ఏకైక పుత్రుని జన్మకు కారకుడు ఈ శంకరం! ఆ సంగతి పాపం- ఈ శంకరానిక్కూడా తెలియదు! ఇప్పుడు జరుగబొయ్యే ఈ వివాహంలోని దంపతులకు తండ్రి ఒక్కడే! ఎవరూ కావాలని ఈ వావివరుసల్ని ఎన్నిక చేయలేదు. విధి బలీయమై, విధే దీన్ని స్వయంగా నిర్వహించింది.

ఇప్పుడు తనేం చేయాలి? మానవుడు నీతికి ఇచ్చిన విలువలన్నీ తన కళ్ళ ఎదుట కూలిపోతుంటే చూస్తూ సహించగలడా? మిగతా మానవు లందరూ కిమ్మనకుండు గాక!

నిజానికి ఈ వివాహంలో ఒక అవినీతి - అన్నా, చెల్లెల్లి దాంపత్య రూపొందుతున్న సంగతి ఈ భూప్రపంచంలో ఇద్దరికే తెలుసు. ఒకరు: సర్వాంతర్యామి ఐన ఈశ్వరుడు. ఆయనేమో నోరు మెదపక - తిరుపతిలో జరగబొయ్యే ఈ పెళ్ళికి ఎలాటి ఆటంకాలూ, అభ్యంతరాలూ, అంగీకారాలూ ఇవ్వకనే మిన్నకున్నాడు. పోతే రెండు; తాను. తానింకా జీవుడే! ఇప్పుడే యీ రహస్యాన్ని వెల్లడిచేసి ఈ పెళ్ళి ఆపించగలడు. తన కర్తవ్య మేమిటి?

తానీ దుర్వార్తను ఆ రెండు కుటుంబాలవారికీ తెలియపరిస్తే ఉభయుల ఆనందాన్నీ చేజేతులా పాడుచేసిన వాడౌతాడు. ఆ యువతీ యువకులు ఎంత ప్రేమించుకున్నారో! ఈ దెబ్బకు తట్టుకోలేక, వారి హృదయాలు ముక్కలై తిరిగి అతికేందుకు పనికిరాక, వారు ఆత్మహత్య చేసుకునే దారుణ పరిస్థితులు ఏర్పడినట్లయితే తానే యీ ఆత్మహత్యలకు

పరోక్ష కారకుడౌతాడు. ఫలితం ఇదే కనుక ఐతే – నవయవ్వనంతో నిండిన రెండు ప్రాణాలను బలిగొన్నందుకు దేవుడు కూడా తనను క్షమించలేడు!

ఫలిత మేమైనప్పటికీ తన విధిని నిర్వహించటంలో తాను వెనుకాడటం దేనికి? యీ పెళ్ళి జరగకుండా చేయగల శక్తి సంపన్నతను విస్మరించట మెందుకు? ఐతే ఎట్టి పరిస్థితుల్లోనూ వీర్యదాతను కానీ, గ్రహీతను కానీ తాను ఎవ్వరికీ చెప్పరాదు. అలా చెప్పటం డాక్టర్‌గా తన విధిని అతిక్రమించటం!

కారణం చెప్పకుండానే యీ వివాహానికి తన అభ్యంతరాన్ని సూచించినట్లయితే – నలుగురూ నవ్వుతారు. కాటికి కాళ్ళు జాచిన తన నెవరు లెక్కజేస్తారు? ఇటు సుందరమ్మ కానీ, అటు శంకరం కానీ తన మొహంలోనే నవ్వగలరు! రెండు కుటుంబాల ఆనందాన్నీ పొట్టన బెట్టుకోజూచిన తనను ఉభయపక్షాల బంధువర్గాలూ దుమ్మెత్తిపోస్తవి.

వీరందరూ తనను ఏమనుకున్నా తనకు పోయేదేమీ లేదు. తన అంతరాత్మ పరిశుద్ధంగా ఉంటుంది. ఫలితాలను అనుభవించేది ఇతరులు. తనకు తెలియకుండానే తాను గురి చూడకుండానే వాడిన ములుకుల్లాటి తన మాటలు అనేక మందిని విశేషంగా గాయపరుస్తవి.

తా నొకవేళ ఈ పెళ్ళికి ముందుగానే చనిపోయి ఉంటే– ఈ వివాహం నిర్విఘ్నంగా జరిగిపొయ్యేది! అందుకు తనకెలాటి బాధ్యతా ఉండేది కాదు. ఈ తర్కవితర్కాలూ, మనోక్షోభా, ముందు గొయ్యీ, వెనుక నుయ్యీ స్థితీ, ఈ క్షీణించే ఆరోగ్యంలో తన శక్తికి మించిన ఈ ఆలోచనల తాకిడి మొదలైనవి ఏవీ ఉండేవి కావు.

ఆ రాత్రంతా నిద్రమాని డాక్టర్ సదాశివం అతి తీవ్రమైన ఆలోచనలు చేశాడు. తెల్లవారుతూండగా ఆయన ఒక నిర్ణయానికి వొచ్చాడు.

ఈ కథ చెప్పి భేతాళుడు ఇలా అన్నాడు:

"రాజా! డాక్టర్ సదాశివం ఎలాటి వ్యక్తో మనకు తెలుసు. ఆయన తీసుకున్న నిర్ణయ మేమిటి? ఆ నిర్ణయం సహేతుకమైనదే గాక, సామాజిక శాంతి భద్రతల్ని లక్ష్యించిందికూడా అయి ఉండాలి. ఇందులో తప్పెవరిది? ఏ నిర్ణయానికైనా సరే సంబంధించిన కీడుకు బాధ్యు లెవరు? ఏది ఒప్పు? ఏది తప్పు? రాజా! నా యీ ప్రశ్న లన్నిటికీ జవాబులు తెలిసి ఉండికూడా చెప్పకపోయావో నీ తల వేయి ముక్కలవుతుంది!"

వీర్య భేతాళుని ప్రశ్నకు విక్రమార్కుని జవాబిది:

"చాలా క్లిష్టమైన పరిస్థితిలో పడ్డాడు – యీ డాక్టర్ సదాశివం. ఆయన జీవితమంతా పరమ పవిత్రంగా బతికాడు. వీర్యదాతను కానీ, గ్రహీతను కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడి చేయరాదనే నియమం ఉన్నది. దాన్ని ఉల్లంఘించేందుకు వీల్లేదు.

ఈ రహస్యాన్ని రహస్యంగానే ఉంచటం వల్ల రెండు కుటుంబాలూ జీవితాంతం వరకూ సుఖ సౌఖ్యాలను అనుభవిస్తవి. రక్షించబడేది కేవలం 'నీతి' అనబడేది. యీ నీతి ఐనా మానవులు ఏర్పరచుకున్నది. దాన్ని సంరక్షించటం, అనుసరింప జేయటం, అనుసరించటం, ప్రతి మానవునికీ విధి. ఐతే యీ ప్రస్తుత, ప్రత్యేక పరిస్థితుల్లో నీతి తప్పినప్పటికీ, అనేకమంది సుఖపడే అవకాశాలు ఉన్నవి.

రెండు పనులు - ఘోరమూ, ఘోరతరమూ అనబడేవి చేసే తీరాలన్నప్పుడు విజ్ఞుడు మొదటి దాన్నే ఎన్నుకుంటాడు. మానవ ప్రయత్నాలను మించిన దైవశక్తులు యీ విచిత్ర, వికృత పరిస్థితిని తెచ్చిపెట్టినవి. ప్రపంచంలో కొన్నిటిని చూసి కూడా చూడనట్లే, పట్టించుకోకుండానే ఉండి తీరాలి. అందువల్ల చేసిన తప్పును దిద్దుకోబోయి మరిన్ని తప్పులు చేయవలసిన దుర్భర పరిస్థితి ఏర్పడకుండా ఉంటుంది.

ఆమాటకొస్తే డాక్టర్ సదాశివం మొదటినుంచీ తప్పులే చేయలేదు. తన విధ్యుక్త ధర్మాన్ని అనుసరించి సుందరమ్మకు కృత్రిమ విధానంలో గర్భధారణ కలిగించాడు. మొదటిది తప్పు కాకున్న, ఇక్కడ ఎదురైన దుస్థితి కారణంగా ఎటు మొగ్గినా పెద్ద తప్పు చేసినవాడౌతాడు.

ఆయన జీవితంలో మరెన్నో కృత్రిమ గర్భధారణలు జరిపించాడు. నిజానికి మరికొన్ని సందర్భాలలో కూడా ఇలాటి వివాహాలూ జరిగి ఉండొచ్చు! లేదా జరిగేందుకు ఎన్నో అవకాశాలున్నవి. ఎందుకంటే ప్రపంచానికి తెలిసిన తండ్రి ఒకరూ, అసలు తండ్రి వేరొకరూ కనుక! వాటన్నిటినీ తాను ఆపగలడా?

ఈ సందర్భంలో డాక్టరు సదాశివం నిజాన్ని వెల్లడించిన మరుక్షణంలో, ఆయన దగ్గర కృత్రిమ గర్భధారణ పొందిన అనేకులు వొచ్చి, తమ దాత లెవరని అడుగుతారు. నిజానికి ఆయన జవాబియ్యనవసరం లేదు. పీడించగా జవాబు చెప్పుదామన్నా, యీ రికార్డులు లేనందువల్ల ఆయన చెప్పలేడు! రికార్డులుంటే తను చనిపోయిన తరువాత వాటిని ఎవరైనా కుళ్ళగిస్తారేమోననే సందేహంతో ఆయన వాటిని తయారు చేయలేదు.

అదీగాక ఇలాటి విచిత్ర పరిస్థితుల్లోనే మరికొన్ని దాంపత్యాలు ఏర్పడి, పిల్లల్ని కని, సుఖంగా ఉంటున్నవి ఉండి ఉండొచ్చు. ఒక్క నిజాన్ని వెల్లడించిన కారణంగా ఎన్ని ఆత్మబలులు సంభవిస్తవో! మెదలకుండా ఉంటే సామాజిక శాంతి భద్రతలు తొణకకుండా, విశేష మేమీ జరగనట్లే ప్రపంచం సాఫీగా సాగిపోతుంది.

తాను యీ రహస్యాన్ని వెల్లడి చేయనందువల్ల తానొక్కడే బాధపడతాడు. కల్మషాత్మ పీడను తానొక్కడే భరిస్తాడు. కాని రహస్యం బట్టబయలైతే అనేకమంది పీడించబడతారు. అనేకుల మనశ్శాంతి భంగపడుతుంది; కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నా చేసుకోవచ్చు.

మానవు లందర్నీ సుఖశాంతుల్లో ముంచెత్తటం తన శక్తికి మించిన పని. కాని సాధ్యమైనంత అధికుల్ని బాధలనుంచి విముక్తి చేయటం తన విధి. యీ అంచనాల ప్రకారం డాక్టర్ సదాశివం– మౌనం వహించటమే అత్యుత్తమ మార్గం.

ఇందులో ఎవరిదీ తప్పు లేదు. సంతానాన్ని కృత్రిమ గర్భధారణ ద్వారా పొందిన రామ్మూర్తి దంపతులు నిరపరాధులే! దాన్ని విజయవంతంగా నడిపిన డాక్టర్ సదాశివం– డాక్టర్‌గా తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహించాడు. వీర్యదానం చేసిన శంరానికి ముట్టవలసిన పుణ్యం ఉండనే ఉన్నది.

వైద్యవృత్తిలో ఉన్నవాడికి నీతి – అవినీతి ప్రస్తావనలు అనవసరం. దేశద్రోహి అని తెలిసినప్పటికీ, అతనికి అత్యవసర చికిత్స చేయటం డాక్టర్ విధి. కఠిన కారాగార శిక్షను అనుభవిస్తున్న వారిక్కూడా వైద్యం చేయబడుతూనే ఉన్నది కదా!

విధి బలీయమై చెలియలికట్ట తెంచుకున్న సముద్రాన్ని ఆప గలగటం ఎవడబ్బతరం? భగవంతుడు ఒక పురుషుణ్ణీ ఒక స్త్రీనీ యీ భూమి మీదికి పంపాడనే కథను అనుసరించి చూసినట్లయితే, వారి సంతానమే ఇప్పుడీ భూమిని ఆక్రమించి ఉండి ఉండాలి. వారి వావి వరుసలు ఏమిటో?

ఒకప్పుడు అన్నాచెల్లెళ్ళ వివాహముండి ఉండేది; అందుకనే అది నిషిద్ధమనే నియమం ఉద్భవించింది.

ఐనా నైతిక దృక్పథం డాక్టర్‌కు ఏవిధంగానూ సంబంధించింది కాదు; కనుక, దాన్ని గూర్చి దీర్ఘంగా ఆలోచించవలసిన అవసరమే లేదు.

విధి పన్నిన వలలో చిక్కుకోకుండా తప్పించుకో గలగటం మానవులకు శక్యమా? ఏదెలా జరగాలో అదంతా నిర్ణయించి, నిర్వహించేది విధి! విధి విలాసానికి కట్టుబడి, విధికి ఆటపావులుగా ఉన్న మానవులు విధి ఇష్టానుసారంగా ప్రవర్తించక తప్పదు.

ఇదంతా ఆలోచించే డాక్టర్ సదాశివం యీ పీడకలను మరిచి పొయ్యేందుకు ప్రయత్నిస్తూ, మౌనం వహించటమే అత్యుత్తమ మార్గంగా నిర్ణయించుకున్నాడు."

విక్రమార్కుని జవాబు వినగానే వీర్య భేతాళుడు తుర్రున ఎగిరి మర్రిచెట్టెక్కాడు.

– జూలై, *1966*